కోటి ఆశలతో..

హోరెత్తిన నూతన సంవత్సర వేడుకలు



గాజువాకలో న్యూ ఇయర్ డ్యాన్స్

గాజువాక/పెదగంట్యాడ: నూతన సంవత్సరానికి గాజువాక ఘన స్వాగతం పలికింది. గతించిన సంవత్సరంలో జ్ఞాపకాలను హృదయాంతరాల్లో నిక్షిప్తం చేసుకొని 2024కు వీడ్కోలు పలికింది. కోటి ఆశలతో కొత్త సంవత్సరాన్ని స్వాగతించింది. గాజువాకలోని పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, కాలనీ అసోసియేషన్లతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కేక్‌లను కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అపార్ట్‌మెంట్లు, నివాస ప్రాంతాల్లో ఆనందోత్సాహాలతో కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. వివిధ హోటళ్లలో నూతన సంవత్సర వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. డీజే సౌండ్స్‌తో కూడిన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో హుషారెత్తించారు. పలుచోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. చర్చిలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో మంగళవారం అర్ధరాత్రివరకు ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన



విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంఈవో రమణాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదగంట్యాడ: వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని మండల విద్యాశాఖాధికారి కంకటాల రమణాజీ అన్నారు. మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన సైన్స్ పరికరాలను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి తరుణ్ కుమార్ తయారు చేసిన యాంటీ స్లీప్ అలారం ప్రాజెక్ట్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజారావు, శేషుకుమారి, రత్నాయమ్మ, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, మధు, లక్ష్మి, ఉమా, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ కామేశ్వరరావు

పెదగంట్యాడ: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కామేశ్వరరావు అన్నారు. అదానీ ఫౌండేషన్, అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో దిబ్బపాలెంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఆటల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరీష్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని శాంతనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణాచార్యులు తిరుప్పావై నిర్వహించారు. తరువాత 16వ పాశురం చదివివి వినిపించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి, ఆలయ కమిటీ ప్రతినిధులు సాహెబ్‌నాయుడు, ఉమామహేశ్వరరావుపాల్గొన్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఉక్కునగరం: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) వార్షిక క్యాలెండర్‌ను మంగళవారం స్టీల్‌ప్లాంట్‌లో ఆవిష్కరించారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, వై.టి. దాస్, కారు రమణ, ఎస్. సత్యనారాయణ, రమణమూర్తి, సుబ్బయ్య, డి. మోహన్, ప్రభాకరరెడ్డి, రాథోడ్, ఎస్.ఎ. నాయుడు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ఆర్యభట్ట చిత్రంతో వేసిన ముగ్గు వద్ద విద్యార్థినులు

అక్కిరెడ్డిపాలెం: నూతన సంవత్సరం సందర్భంగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు, గణిత ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థినులు రఘుపాత్రో స్వప్న, జి.ప్రీతి, ఎన్.అఖిల, రిషితలు ఆర్యభట్ట చిత్రంతో వేసిన ముగ్గు ఆకట్టుకుంది. -గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో గణిత ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. గణితశాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజం చిత్రపటానికి హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం నివాళులర్పించారు.

హైందవ శంఖారావం కరపత్రం ఆవిష్కరణ

గాజువాక: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభ పోస్టర్‌ను స్థానిక బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. పాతకర్ణవానిపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మూడు లక్షల మందితో సభ జరగనుందని తెలిపారు. బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు కృష్ణ, వాసు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆనందరావు సేవలు మరువలేనివి

అగనంపూడి: ఆలిండియా దళిత రైట్స్ ఫోరం (ఏఐడీఆర్‌ఎఫ్) వ్యవస్థాపకులు, ఆంధ్రాభవన్ (న్యూఢిల్లీ) మాజీ అసిస్టెంట్ కమిషనర్ కందుల ఆనందరావు సేవలు నిరుపమానమని దళిత సంఘం నాయకులు కేబీఆర్ అంబేడ్కర్, పాల్తేటి పెంటారావు, బూసి వెంకటరావు, ఏఐడీఆర్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరి శ్రీనివాసరావు అన్నారు. ఆనందరావు నాలుగో వర్ధంతిని రాజీవ్‌నగర్ రత్న ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దళితుల హక్కుల పరిరక్షణ కోసం ఆనందరావు విశేష కృషి చేశారన్నారు.

దోపిడీ కేసులో ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న జోన్-2 ఏసీపీ లక్ష్మణరావు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం దరి స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద రోడ్డు పక్కన గత నెల 27న కాలకృత్యాలు తీర్చుకుంటున్న వ్యక్తిపై దాడి చేసి నగదు దోపిడీ చేసిన కేసులో క్రైం పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం జోన్-2 ఏసీపీ డి. లక్ష్మణరావు వెల్లడించారు. వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీకు చెందిన కర్రి మహేష్ పై భౌతిక దాడి చేయడంతో రూ.7250 నగదు బదిలీ చేయించుకున్న ఆరుగురిని మంగళవారం అగనంపూడి ఓల్డ్ ఐస్ ఫ్యాక్టరీ వద్ద అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 5 వేలు నగదు, సిల్వర్ చైన్, మొబైల్ ఫోన్, కత్తి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో క్రైం సీఐ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ రుక్మాంగధరావు పాల్గొన్నారు.